# ఇండో - ఇస్లామిక్ సంస్కృతి - సూఫీ, భక్తి ఉద్యమాలు

**ప్ర: భారతీయ సంస్కృతిపై ఇస్లాం ప్రభావాన్ని వివరించండి? (లేదా) ఇండో-ఇస్లామిక్ సంస్కృతి అభివృద్ధి చెందడానికి కారణాలను విశ్లేషించి, ఆ సంస్కృతిని చర్చించండి? (లేదా) తొలుత ఇస్లాం- హిందూ వాదం పరస్పరం సంఘర్షించుకున్నా.. కాలక్రమేణా ఆ రెండూ సమన్వయం సాధించాయి. చర్చించండి?**

**జ:** ఇస్లాం మత ఆవిర్భావం నుంచి ఆ మతంతో భారతదేశానికి పరిచయం ఉంది. తురుష్కుల దండయాత్రల కంటే ముందే అరబ్ వర్తకులు భారతదేశంలో స్థిరపడ్డారు. అప్పట్నుంచి హిందూ, ముస్లిం సమాజాలు పరస్పరం ప్రభావితమయ్యాయి. శతాబ్దాలపాటు సాగిన ఈ పరిణామం ఒక సమైక్య సంస్కృతికి లేదా ఇండో - ఇస్లామిక్ సంస్కృతికి జీవం పోసింది.

ముస్లింలు భారతదేశానికి వచ్చి స్థిరపడటంతో హిందువులు, ముస్లింలు తప్పనిసరిగా కలిసుండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తొలుత పరస్పరం అనుమాన దృష్టితో చూసుకున్నా క్రమంగా ఒకరి నొకరు అర్థం చేసుకున్నారు. ముస్లింలు భారతదేశంలో తమ పాలనను విస్తరించుకున్నారు. మొఘలులు ఈ విస్తరణను పతాకస్థాయికి తీసుకెళ్లారు. ఫలితంగా ఉమ్మడి పాలనా వ్యవస్థ ఎన్నో ఏకరూపత కలిగిన అంశాల్ని సృష్టించింది.

**ఉదాహరణ:** రాజభాషగా ఉన్న పర్షియన్ అందరినీ ప్రభావితం చేయడం పాలకుల ధోరణి కూడా కొంతమేర సమైక్య సంస్కృతికి దోహదం చేసింది. మధ్య యుగాల్లో హిందూ పాలకులు ముస్లింలను.. ముస్లిం పాలకులు హిందువులను పాలనలో భాగస్వాములను చేశారు. శ్రీరాజ్ అనే హిందువును మహ్మద్ బిన్ తుగ్లక్ వజీరుగా నియమించాడు. మొఘలులు రాజపుత్రులను, మరాఠీలను ఉన్నత పదవుల్లో నియమించారు. కాశ్మీర్‌ను పాలించిన 'జైనులాబిదిన్' హిందూ మతాన్ని ఆదరించాడు. అక్బర్ కాలంలో అన్ని మతాలు సమానమనే భావన బలంగా ప్రచారమైంది. మధ్య యుగాల్లో తలెత్తిన ఉదారవాద సూఫీ, భక్తి ఉద్యమాలు హిందూ, ముస్లిం సమాజాల మధ్య అవగాహన వృద్ధికి దోహదపడ్డాయి. పండితులు, మేధావులు వివిధ అంశాలను ఇచ్చిపుచ్చుకోవడం కళాకారులు, కవులు పరస్పరం ప్రభావితమై ఇండో-ఇస్లామిక్ సంస్కృతికి దోహదం చేశారు.

## ఇండో-ఇస్లామిక్ సంస్కృతి:

**సమాజం:** ఇస్లాం ప్రభావంతో హిందూ సమాజం కొన్ని మార్పులకు లోనైంది. ముస్లింల రాకతో హిందూ సమాజ స్వచ్ఛతను కాపాడాలనే ప్రయత్నంలో వర్ణ వ్యవస్థను కఠినం చేశారు. హిందూ కన్యలను ముస్లింలు వేధిస్తున్నారనే నెపంతో బాల్య వివాహాలను ప్రోత్సహించారు. ముస్లింలను అనుసరిస్తూ హిందూ సమాజంలోని ఉన్నత వర్గాలు పరదా పద్ధతిని అవలంబించాయి. ముస్లింల వేష భాషలు, ఆహార విశేషాలను హిందువులు స్వీకరించారు.



అదే విధంగా హిందూ సమాజ ప్రభావంతో ముస్లిం సమాజంలో కూడా మార్పులు చోటు చేసుకున్నాయి. ఇస్లాం స్వీకరించిన హిందువులు తమ జాతి బేధాలను ముస్లిం సమాజంలో ప్రవేశ పెట్టారు. మతాంతీకరణల వల్ల కొన్ని కొత్త కులాలు, ఉపకులాలు పుట్టుకొచ్చాయి. హిందువుల వివాహ ఆచారాలు కొన్నిటిని ముస్లింలు స్వీకరించారు. శుభ సందర్భాల్లో హారతి ఇచ్చే పద్ధతిని 'నిసర్'గా.. దిష్టి అనే భావనను 'నజర్'గా ముస్లింలు స్వీకరించారు. హిందువుల ప్రభావంతో ముస్లింలలోనూ వరకట్న దురాచారం ప్రబలింది. హిందువుల్లో కుల బేధాల తీవ్రతను అనుకరిస్తూ ముస్లింలు సున్నీ- షియా బేధాలను తీవ్రం చేశారు. హిందువులను, అనుకరిస్తూ కొందరు ముస్లింలు బహుభార్యత్వాన్ని త్యజించారు.

**మతం:** సూఫీ, భక్తి ఉద్యమాల వల్ల ఇస్లాం, హిందూ మతాల మధ్య భావ ప్రచారం సాగింది. సూఫీ సన్యాసులు బోధనలను హిందువులు వినడం, సూఫీల సమాధులను దర్శించడం మొదలైంది. అలాగే ముస్లింలు కూడా హిందూ భక్తి ఉద్యమకారుల బోధనలు విన్నారు. శిష్యులుగా చేరారు. జీవాత్మ, పరమాత్మ ఐక్యమవ్వాలనే భావనను సూఫీలు భారతదేశంలో స్వీకరించారు. బెంగాల్‌లోని ముస్లింలు.. సీతా, కాళీ వంటి హిందూ దేవతలను ఆరాధించారు.

**కళలు- విజ్ఞానం:** హిందువుల నుంచి వైద్యం, గణితం, జ్యోతిష్యాలకు సంబంధించిన అంశాలను ముస్లింలు స్వీకరించారు. ముస్లింలు సంస్కృతంలోని వైద్య రచనలను 'టిబ్బి - ఇ - సికిందరి' పేరుతో పర్షియన్‌లోకి అనువదించారు. మరోవైపు ముస్లింల నుంచి రసాయన శాస్త్ర పరిజ్ఞానాన్ని, 'జిచ్' అనే క్యాలెండర్‌కు సంబంధించిన అంశాలను, 'తాజిక్' అని పిలిచే జ్యోతిష్య శాస్త్ర విభాగాన్ని హిందువులు స్వీకరించారు.

సాహిత్యానువాదాలు కూడా జరిగాయి. 'బదౌని' రామాయణాన్ని పర్షియన్‌లోకి అనువదించగా కొందరు ముస్లిం పండితులు సంయుక్తంగా మహాభారతాన్ని 'రమ్జానామా' పేరుతో పర్షియన్‌లోకి అనువదించారు. అమీర్‌ఖుస్రో భారతదేశాన్ని తన మాతృభూమిగా ఆద

రిస్తూ హిందీ భాషాభివృద్ధికి కృషి చేశాడు. కవిత్వంలో భారతీయ శైలి (సబక్ –ఇ – హింద్)ని ప్రోత్సహించాడు.

ముస్లింలు భారతీయ వాస్తు కళలకు కమాన్, గుమ్మటం, మీనార్ (స్తంభాలు) వంటి కొత్త అంశాలను జోడించారు. రంగురాళ్లను వినియోగించే పద్ధతి ప్రవేశపెట్టారు. గొప్ప సౌందర్య దృష్టితో, శాస్త్రీయ పరిజ్ఞానంతో ఉద్యాన కళను అభివృద్ధి చేశారు. ముస్లిం పాలకులు అభివృద్ధి చేసిన వాస్తుశైలి ప్రభావం అనేక ప్రాంతీయ శైలులపై ప్రభావం చూపింది. బృందావనంలోని ఆలయాల్లో మొగల్ శైలి ప్రభావం కనిపిస్తుంది. అక్బర్ నిర్మించిన ఫతేపూర్ సిక్రీలో హిందూ–ఇస్లామిక్ శైలుల సమన్వయం కనిపిస్తుంది.

ముస్లింలు పర్షియన్ చిత్ర కళారీతులను భారతదేశంలో ప్రవేశపెట్టారు. దీని లక్షణాలు ఎన్నో ప్రాంతీయ చిత్రలేఖనా శైలులను ప్రభావితం చేశాయి. పర్షియన్ సంగీత సంప్రదాయాల ప్రభావంతో ఉత్తర భారతదేశంలో హిందుస్థానీ సంగీతం అభివృద్ధి చెందింది. అమీర్ ఖుస్రో, జైపూర్ పాలకుడు హుస్సేన్ షా షర్కీ వంటి వారు ఎన్నో కొత్త రాగాలను సృష్టించారు. రబాబ్, సారంగీ, తబాలా వంటి సంగీత వాద్య పరికరాలు ప్రవేశించాయి. కర్ణాటక సంగీతంపై అవగాహన కోసం అమీర్ ఖుస్రో.. నాయక్ గోపాల్ అనే కర్ణాటక సంగీత విద్వాంసుడితో సత్సంబంధాలు సాగించినట్లు సమాచారం. అక్బర్ కాలంలో ఆగ్రా వద్ద ఆవిర్భవించిన జాతీయ సంగీతం సాంస్కృతిక సమైక్యతకు పరాకాష్ట.

ముస్లిం పాలన వల్ల అరబిక్, పర్షియన్ భాషలపై దేశీయమైన భారతీయ భాషల ప్రభావంతో ఉర్దూ అనే కవితాత్మక భాష సమైక్య సాంస్కృతిక వారసత్వంగా ఆవిర్భవించింది. సాహిత్యాసక్తితో, ఉద్యోగావకాశాల కోసం అన్ని మతాలు, ప్రాంతాలకు చెందిన వారు ఉర్దూను సొంతం చేసుకున్నారు.

**ప్ర:'భక్తి'ని నిర్వచించి, మధ్య యుగాల్లో వివిధ భక్తి ఉద్యమకారుల కృషిని తెలపండి?**

**జ:** భక్తి అనే భావన ఉపనిషత్తుల కాలం నుంచే ఉందని భావించొచ్చు. భక్తి అంటే దేవుని పట్ల పరిపూర్ణ విశ్వాసం, ప్రేమతో కూడిన అంకితభావం అని నిర్వచించవచ్చు. శ్వేతాశ్వతర ఉపనిషత్తు, భగవద్గీతలలో భక్తి భావనను వివరించారు. దక్షిణాదిన వైష్ణవ భక్తులైన ఆళ్వారులు, శైవ భక్తులైన నాయనార్‌లు భక్తిని ప్రచారం చేశారు. మధ్య యుగాల్లో రామానుజాచార్యుడి బోధనలు భక్తి ఉద్యమానికి పునాదులు వేశాయి. రామానందుడుని ఉత్తరాదిన భక్తి ఉద్యమానికి ఆద్యుడిగా భావించవచ్చు.

రామానందుడితో ప్రారంభమైన భక్తి ఉద్యమం ఉత్తరాదిన ఎంతో వ్యాప్తి, వైవిధ్యాన్ని పొందింది. ఈ ఉద్యమంలో ప్రధానంగా సగుణ, నిర్గుణ శాఖలను గుర్తించవచ్చు. సగుణ శాఖలో తిరిగి రామ మార్గీయులు, కృష్ణ మార్గీయులు అనే శాఖలను గుర్తించవచ్చు. భగవంతుడు నిరాకారుడు అని చెప్పిన కబీర్, నానక్, రవిదాస్ వంటి వారు నిర్గుణ శాఖకు ప్రతినిధులు. అదే విధంగా మీరాభాయ్, సూరదాస్, తులసీదాస్ వంటి వారు సగుణ శాఖకు ప్రతినిధులు.

నిర్గుణ వాదుల్లో రామానందుడి శిష్యుల్లో కబీర్ ప్రసిద్ధుడు. ఆయన భగవంతునికి రామ్, రహీమ్, అల్లా వంటి అన్ని రకాల పేర్లను వాడాడు. నానక్ కూడా ఇదే ధోరణి అవలంభించాడు. భగవంతుడు అన్ని మతాలకు అతీతుడని, ఆద్యంత రహితుడని రవిదాస్ పేర్కొన్నాడు.

చైతన్యుడు, వల్లభాచార్యుడు, మీరాబాయ్, సూర దాస్ వంటి వారు కృష్ణ భక్తిని ప్రచారం చేయగా.. తులసీదాస్ రామభక్తిని ప్రచారం చేశాడు. చైతన్యుడు కృష్ణుడి పట్ల అచెంచల భక్తితో, నాట్యగానంతో బెంగాల్, ఒరిస్సాల్లో తన బోధనలు ప్రచారం చేశాడు. వల్లభాచార్యుడు మోక్షసాధనకు పుష్టి (దేవుని కృప) మార్గాన్ని ప్రచారం చేశాడు. మీరాబాయ్, సూరదాస్‌లు గాఢమైన కృష్ణ భక్తిని తమ రచనల ద్వారా ప్రచారం చేశారు. తులసీదాస్ రామచరిత మానస్ ద్వారా రామ భక్తికి విశేష ప్రచారం కల్పించాడు.

మహారాష్ట్రలోని జ్ఞానేశ్వర్, నామదేవ్, ఏకనాథ్, తుకారం వంటి వారు సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలను నిరసిస్తూ, పంఢాపూర్‌లోని విఠోభా పట్ల భక్తిని ప్రచారం చేశారు. సమర్థ రామదాస్ భక్తితోపాటు లౌకిక బోధనలు కూడా తన 'దాస బోధ' ద్వారా ప్రచారం చేశాడు.

**ప్ర:సూఫీ భావనలను వివరించి, భారతీయ సమాజంపై సూఫీల ప్రభావాన్ని, సూఫీవాదంపై హిందూ మత ప్రభావాలను తెలపండి?**

**జ:** భారతదేశంలోకి ఎందరో సూఫీ సన్యాసుల ప్రవేశం పదమూడో శతాబ్దం నుంచి మొదలైంది. ఢిల్లీ సుల్తానత్ స్థాపనకు ముందే అజ్మీర్ కేంద్రంగా ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ సూఫీ వాదాన్ని ప్రచారం చేశాడు. ఆ తర్వాత ఎన్నో సూఫీ శాఖలు (సిల్‌సిలాలు) భారతదేశంలో ప్రవేశించాయి. మధ్య యుగాల్లో సాంస్కృతిక సమైక్యతకు సూఫీలు దోహద పడ్డారు.

**సూఫీ భావనలు:**

సూఫీలు భగవంతుని పట్ల ప్రేమ, భక్తి ప్రపత్తులే మోక్షాన్ని ప్రసాదిస్తాయని విశ్వసించారు. జీవాత్మ పరమాత్మతో సమైక్యమవ్వాలని 'వహదతుల్ వజుద్' అనే సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. అయితే మొగలుల కాలంలో స్థాపించిన నక్షబందీ శాఖకు చెందిన షేక్ అహ్మద్ సర్హిందీ ఈ సిద్ధాంతాన్ని తోసిపుచ్చాడు. భగవంతునికి, మానవులకు మధ్య ప్రేమికుల సంబంధం కాకుండా యజమాని – బానిసల సంబంధం ఉండాలని భావిసక్త 'వహదతుల్ షుద్' సిద్ధాంతాన్ని ప్రచారం చేశాడు. మక్కా, గంగ మోక్షాన్ని ఇవ్వలేవని, అహాన్ని పరిత్యజించడమే మోక్ష మార్గమని 18వ శతాబ్దంలో పంజాబ్‌లో సంచరించిన సూఫీ సన్యాసి బుల్లేషా బోధించాడు.

సూఫీలు ఆధ్యాత్మిక పురోగతి కోసం ఒక గురువు తప్పనిసరని భావించారు. పీర్‌మురాదీ(గురుశిష్యులు) వ్యవస్థను ప్రోత్సహించారు. నైతిక ప్రవర్తనకు ప్రాధాన్యమిచ్చారు. డబ్బు ముట్టుకోరాదని

పేదరికమే సుగుణమని ప్రచారం చేశారు. అయితే ఇందుకు సుహ్రావర్దీ శాఖ మినహాయింపు. సూఫీలు బ్రహ్మచర్య నియమాన్ని పట్టించుకోలేదు. ఆధ్యాత్మిక పురోగతికి, కుటుంబ జీవితం ఆటంకం కాదని భావించారు. ప్రపంచాన్ని త్యజించి క్రియారాహిత్యంతో జీవించడాన్ని హర్షించలేదు. భౌతిక శ్రమతో జీవనోపాధి కల్పించుకుంటూనే భగవంతుడిని అన్వేషించారు. కాబట్టి ఎందరో సూఫీలు రైతులుగా, కసాయి పనివారుగా, నేతపని వారుగా శ్రమించారు.

**సూఫీల ప్రభావం:** సూఫీలు నైతిక జీవనాన్ని నిరాడంబరంగా బోధిస్తూ సామాన్య ప్రజలను విశేషంగా ఆకర్షించారు. పరమత సహన ధోరణిని పాటించడం వల్ల హిందువులు కూడా వారి బోధనలకు ఆకర్షితులయ్యారు. సూఫీల సమాధులను దర్శించడం, సూఫీలను ఆరాధించడం హిందువులు కొనసాగిస్తున్నారు. సూఫీలు తమ వ్యక్తిత్వంతో పాలకులను, ఉన్నతోద్యోగులను కూడా ప్రభావితం చేశారు. సూఫీల భావనలు హిందూ మతంలో కూడా కొంతమేరకు ఉదారవాద ధోరణిని ప్రోత్సహించాయి. ఆర్థిక వ్యత్యాసాలు, సాంఘిక అసమానతలను ఖండిస్తూ సూఫీలు సంస్కరణ వాదాన్ని ప్రోత్సహించారు.

**సూఫీలపై హిందూ మత ప్రభావం:** సూఫీలు ప్రచారం చేసిన వహదుతల్ వజుద్ భావన భారతీయ అద్వైత భావనకు దగ్గరగా ఉంది. వారు దీనిని భారతదేశంలో స్వీకరించారనే వాదన బలంగా ఉంది. సూఫీ సన్యాసులు యోగ సాధన చేశారు. పర్షియన్‌లోకి అనువదించిన 'అమృతకుండ' అనే హర్షయోగానికి సంబంధించిన గ్రంథం సూఫీలపై ప్రభావాన్ని చూపించింది. నిజాముద్దీన్ ఆలియా అనే చిస్తీ సన్యాసి యోగ సాధన చేసి సిద్ధుడుగా పేరుగాంచాడు. కాశ్మీరులో లల్లా అనే శైవయోగిని బోధనల ప్రభావంతో సూఫీలు 'రుషి' ఉద్యమాన్ని నడిపారు.